అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని వినతి



ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పోచారం నాయకులు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్‌ను బీజేపీ పోచారం మున్సిపల్ అధ్యక్షుడు నానావత్ సురేష్ నాయక్ సోమవారం కోరారు. ఈమేరకు ఎంపీకి వినతిపత్రం అందజేశారు. శ్రీసాయిగణేష్ ఎన్‌క్లేవ్ కాలనీలో డ్రైనేజీ, సీసీ రోడ్లు, పార్కు జాగాలో కమ్యూనిటీ హాల్, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అందుకు ఈటల సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ఆనంద్, బొడ్డు నాయక్, మనోహర్‌రెడ్డి, సదానందం, రాజేశం, రామాంజనేయులు, గోపీకృష్ణ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్ల్‌మార్క్స్ జయంతి వేడుకలు

కాప్రా: కార్ల్‌మార్క్స్ సిద్ధాంతమే నేటి సమాజానికి శిరోధార్యమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీఎస్.బోస్ అన్నారు. సోమవారం ఈసీఐఎల్‌లోని సీపీఐ కార్యాలయంలో కార్ల్ మార్క్స్ 207వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. కార్ల్ మార్క్స్ ఆయన జీవిత కాలమంతా విస్తృతమైన పరిధిలో మార్కిస్ట్ సిద్ధాంతాన్ని అనుసరించాడన్నారు. మార్క్స్ అతని సహచరుడు ఫ్రెడరిక్ ఎంగెల్స్ కలిసి చరిత్ర భౌతికవాద అవగాహనను రూపొందించాడని, అదే చారిత్రక భౌతికవాదంగా పేరుగాంచిందని తెలిపారు. సీపీఐ, ఏఐటీయూసీ నేతలు దామోదర్‌రెడ్డి, శంకర్‌రావు, నరసింహ, రాఘవేంద్రరావు, సత్యప్రసాద్, సాయిలు, అశోక్, కిరణ్, రాకేష్ తదితరులున్నారు.

బేస్‌మెంట్ల తొలగింపు

బోడుప్పల్: ప్రభుత్వ స్థలంలో అక్రమంగా వెలిసిన మూడు బేసిమెంట్లను సోమవారం మండల రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా మేడిపల్లి మండల తహసీల్దార్ హసీనా మాట్లాడుతూ... ప్రభుత్వ స్థలాలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. చట్ట విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే వారిపై క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాలను నిత్యం రెవెన్యూ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

దశలవారీగా అభివృద్ధి పనులు



సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టి మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ ప్రభుదాస్ అన్నారు. డివిజన్ పరిధిలోని నవోదయ నగర్‌లో సోమవారం సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. డివిజన్‌లో సీసీరోడ్లతో పాటు మౌలిక వసతులు అవసరమైన కాలనీలను గుర్తించి దశలవారీగా పనులు చేపడుతూ ముందుకుసాగుతున్నట్లు తెలిపారు. పనులు సకాలంలో పూర్తిచేసి సీసీ రోడ్డును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఏఈ లింగరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ చారి, కాలనీ అధ్యక్షుడు కత్తుల రాజ్‌కుమార్, జయపాల్, లింగం, జమాలయ్య, నాగరాజు తదితరులున్నారు.

శివరాత్రి యాదగిరికి గద్దర్ ఐకాన్ అవార్డ్

కుత్బుల్లాపూర్: సమాజ సేవకుడు, గాయకుడిగా సేవలందించిన కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన శివరాత్రి యాదగిరి గద్దర్ ఐకాన్ అవార్డును అందుకున్నారు. సాయి అలేఖ్య సంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో భాస్కర ఆడిటోరియంలో వేణుగోపాలచారి అధ్యక్షతన జరిగిన గద్దర్ ఐకాన్ అవార్డు-2024 కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ చేతుల మీదుగా శివరాత్రి యాదగిరి అవార్డును అందుకున్నారు. శివరాత్రి యాదగిరి 1992 నుంచి ఆల్ ఇండియా రేడియోలో వందలాది జానపద గేయాలు పాడి పలు అవార్డులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, తెలంగాణ సాంస్కృతిక శాఖ చైర్మన్ వెన్నెల గద్దర్, ప్రజా గాయని విమలక్క హాజరయ్యారు.

శివారుల్లో రాయితీ రాబడి రూ.103.74 కోట్లు

- 2025-26 ఆర్థిక సంవత్సరానికి పన్ను చెల్లింపుపై 5 శాతం రాయితీ
- పురపాలికల్లో ప్రజల స్పందనతో అత్యధిక రాబడి



సాక్షి, సిటీబ్యూరో: 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ముందస్తు పన్నుల చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ ప్రకటించడంతో ఇప్పటి వరకు విధించిన టార్గెట్‌లో 28.60 శాతం పన్నులు అంటే.. రూ.103.74 కోట్లు ప్రజలు చెల్లించడంతో మున్సిపల్ శాఖ అధికార వర్గాల నుంచి సంతృప్తి వ్యక్తం అవుతోంది. 33 రోజులు మాత్రమే ఐదు శాతం పన్ను రాయితీ వర్తింపు ఉండటంతో.. ప్రజల నుంచి చెల్లింపులు అంచనాకు వచ్చినట్లు భావిస్తున్నారు.

13 పురపాలక సంఘాల్లో పన్నులు ఇలా..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 13 పురపాలక సంఘాలకు సంబంధించి 2025-26 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన ఆస్తి, ఇతర పన్నుల వసూళ్లపై సర్కారు ఏప్రిల్ ఒకటి నుంచి మే 3 వరకు 5 శాతం రాయితీ ప్రకటించటంతో.. ఆశించిన మేర ఆదాయం ఉన్నట్లు మున్సిపల్ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. నాలుగు నగర పాలక సంస్థలు, తొమ్మిది మున్సిపాలిటీల్లో విస్తృతంగా పన్ను రాయితీపై ప్రచారం నిర్వహించి ఉంటే వసూళ్లు మరింత పెరిగేవి అనే అభిప్రాయాలు స్థానిక ప్రజల నుంచి వ్యక్తం అవుతున్నాయి.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో.. 5 శాతం పన్ను రాయితీతో వసూలైన పన్నుల వివరాలు

- బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.31.60 కోట్లకు రూ.8.98 కోట్లు (28.43 శాతం) వసూలు అయ్యాయి.
- పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.38.14 కోట్లకు రూ.12.96 కోట్లు (33.97శాతం) వసూలు..
- జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.15.38 కోట్లకు రూ.2.35 కోట్లు (15.28శాతం),
- నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.78.08 కోట్లకు రూ.26.00 కోట్లు (33.31 శాతం) వసూలయ్యాయి.
- మున్సిపాలిటీలు పోచారంలో రూ.27.71 కోట్లకు రూ.4.28 కోట్లు (15.47 శాతం),
- తూముకుంటలో రూ.18.32కోట్లకు రూ.6.70 కోట్లు(36.59 శాతం),
- నాగారంలో రూ.22.61 కోట్లకు రూ.7.40కోట్లు (32.72శాతం),
- మేడ్చల్‌లో రూ.16.07కోట్లకు, రూ.5.05కోట్లు (31.42శాతం),
- కొంపల్లిలో రూ.17.99 కోట్లకు, రూ.5.11 కోట్లు(28.43శాతం),
- ఘట్‌కేసర్ రూ.11.14 కోట్లకు, రూ.2.03 కోట్లు (18.22శాతం) వసూలయ్యాయి.
- గుండ్లపోచంపల్లిలో రూ.21.35కోట్లకు, రూ.7.76కోట్లు(36.38శాతం),
- దమ్మాయిగూడలో రూ.23.27కోట్లకు, రూ.3.91 కోట్లు(16.82శాతం),
- దుండిగల్ మున్సిపాలిటీలో రూ.40.99కోట్లకు, రూ.11.16 కోట్లు (27.24శాతం).
- జిల్లాలో మొత్తం రూ.362.70 కోట్లకు గానూ రూ.103.74 కోట్లు(28.60 శాతం) వసూలయ్యాయి.

శాస్త్రవేత్తల సలహాలతో అధిక ఆదాయం



రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

పోచారం: వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటిస్తే సాగు ఖర్చులు తగ్గడంతో పాటు రైతులు అధిక ఆదాయం పొందవచ్చని మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. ప్రతాపసింగారంలోని వార్డు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రైతులకు ఎంతో సేవ చేస్తోందని కొనియాడారు. వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.నరేంద్రరెడ్డి మాట్లాడుతూ.. వరి పంటలో కాండం తొలుచు పురుగు, పురుగు మందు అవశేషాలు లేని పంట ఉత్పత్తులపై అవగాహన కల్పించారు. ప్రొఫెసర్ జె.సురేష్ మాట్లాడుతూ.. నాణ్యమైన విత్తనాలు వాడితే అధిక దిగుబడులు సాధ్యమన్నారు. ఘట్‌కేసర్ మండల వ్యవసాయాధికారి ఎండీ బాసిత్ మాట్లాడుతూ.. రైతుల సమస్యల పరిష్కారానికి వ్యవసాయ శాఖ, వ్యవసాయ విశ్వవిద్యాలయం ముందుంటాయన్నారు. అనంతరం వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మేనేజర్ వెంకట్రామిరెడ్డి, ఏఈఓ జె.మంజుల, ఇన్‌చార్జి మహిపాల్‌రెడ్డి, రైతులు సుభాష్‌రెడ్డి, అంజయ్య, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

డబీల్‌పూర్, శ్రీరంగవరం గ్రామాల్లో..

మేడ్చల్: రైతులకు అధునాతన వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమం మేడ్చల్ మండలంలో సోమవారం ప్రారంభమైంది. మండలంలోని డబీల్‌పూర్, శ్రీరంగవరం గ్రామాల్లో వ్యవసాయాధికారులు ఆచార్య జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలతో కలిసి ప్రారంభించారు. రైతు వేదికల వద్ద, పొలాల వద్ద రైతులతో శాస్త్రవేత్తలు, అధికారులు సమావేశమై చీడ పీడ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఉద్యాన పంటలపై తీసుకోవాల్సిన మెళకువలను తెలియజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీనివాస్ కుమార్, డాక్టర్ సుధాన్షు, డాక్టర్ స్వామి, శశి, మానసరెడ్డి, రఘునాథరావు, ఏఓ అర్చన, ఏఈఓలు సుమీత, తేజస్విని రైతులు పాల్గొన్నారు.

భోగారం గ్రామంలో..

కీసర: రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా కీసర మండల వ్యవసాధికారి మాధవీలత ఆధ్వర్యంలో భోగారంలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో శాస్త్రవేత్తలు శ్రీదేవి, సందీప్, విక్రం తదితరులు మాట్లాడుతూ వరిపంటలో రకాలు, వాటి దిగుబడి, యూరియా, క్రిమిసంహారక మందుల వాడకం, చీడపీడల నివారణకు చర్యలు తదితర వాటి గురించి రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ విస్తరణ అధికారి వందన, రైతులు నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



భోగారంలో రైతు ముంగిట్లో శాస్త్ర వేత్తలు కార్యక్రమం



శ్రీరంగవరంలో..

దరఖాస్తులను వెంట వెంటనే పరిష్కరించాలి

- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్
- ధర్మారం గ్రామంలో భూభారతి సదస్సు



ధర్మారంలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ గౌతమ్‌కుమార్

కీసర: భూసమస్యల శాశ్వత పరిష్కారం కోసం భూభారతి పేరుతో ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. భూభారతి పైలట్ ప్రాజెక్ట్ రెవెన్యూ సదస్సును కీసర మండలం, ధర్మారం గ్రామంలో సోమవారం నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న ఆయన రైతులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. భూభారతి చట్టంపై అవగాహన కల్పించి, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా సదస్సు నిర్వహణ కోసం చేసిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరించారు. సిబ్బంది పనితీరుపై ఆరాతీసి అధికారులకు పలు సూచనలు చేశారు. అర్జీలు సమర్పించేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. భూ సమస్యలు ఉన్నవారు నిర్ణీత ప్రొఫార్మాలో దరఖాస్తు చేసుకునేలా సహకారం అందించాలని హెల్ప్ డెస్క్ సిబ్బందిని ఆదేశించారు. దరఖాస్తులను వెంటవెంటనే పరిశీలించి తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పైలెట్ ప్రాజెక్టు కింద అమలు చేస్తున్న రెవెన్యూ సదస్సులను కీసర మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. అనంతరం నర్సంపల్లిలో రెవెన్యూ సదస్సును పరిశీలించారు. కీసర ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి, తహసీల్దార్ అశోక్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆలోచనలకు పదును పెట్టాలి

మేడ్చల్: మైసమ్మగూడలోని మల్లారెడ్డి కళాశాలలోని ఎమ్ఆర్ సెట్ క్యాంపస్‌లో ఎంబీఏ విద్యార్థులకు క్రియేటివ్ క్యాష్ కౌస్ కార్యక్రమాన్ని రెండు రోజుల పాటు నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వీఎస్‌కే రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. కౌస్‌ను నాలుగు విభాగాలుగా విభజించి వివరించారు. విద్యార్థులు తమకున్న ఆలోచనలను మరింత పదును పెట్టుకోవడానికి వావ్-వెల్త్, బౌట్, వేస్ట్ కార్యక్రమాలు ఉపయోగపడతాయని అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ఎంబీఏ విద్యార్థులను ఉత్తమ వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడానికి బీఈఈ-బెస్ట్ ఎమర్జింగ్ వంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని అన్నారు. హెచ్‌ఓడీలు, ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీలోని 23 వార్డుకు చెందిన లబ్ధిదారుడికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన ఆర్థిక సాయం చెక్కును మాజీ కౌన్సిలర్ కొడె మహేష్ అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డుకు చెందిన భాస్కర్‌రెడ్డికి రూ.26 వేల ఆర్థిక సాయం మంజూరు కావడంతో ఆ చెక్కును ఆయన నివాసంలో అందజేశారు.

యువకుడి ఆత్మహత్య

శామీర్‌పేట్: 19 ఏళ్ల యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేట మండల కేంద్రానికి చెందిన బండారి దేవేందర్ ఇటీవల 10వ తరగతి పూర్తి చేసి సెంట్రింగ్ పనికి వెళ్తున్నాడు. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. శామీర్‌పేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాప్రయోజన స్థలం కబ్జాపై ఫిర్యాదు



ప్రజాప్రయోజన స్థలంలో వెలసిన అక్రమ నిర్మాణం



రెండేళ్ల క్రితం అక్రమ నిర్మాణం తొలగిస్తున్న దృశ్యం

పోచారం: అన్నోజిగూడలో ప్రజాప్రయోజన స్థలాన్ని కబ్జా చేశారని పోచారం మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డికి సాయిగణేష్ కాలనీవాసులు సోమవారం ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్-17, 47లో ఏర్పాటు చేసిన సాయిగణేష్ కాలనీలో ప్లాట్ నంబర్-43, 44 మధ్య ప్రజాప్రయోజనాల కోసం సుమారు 200 చదరపు గజాల స్థలాన్ని కేటాయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రెండేళ్ల క్రితం ఈ జాగాలో ఓ వ్యక్తి అక్రమ నిర్మాణం చేపట్టడంతో అప్పటి కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని, వెంటనే కూల్చివేశారని చెప్పారు.

ఇదే జాగాలో మరో వ్యక్తి కొత్తగా అక్రమ నిర్మాణం చేపట్టిన విషయాన్ని ప్రస్తుత కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన స్థలంలోని అక్రమ నిర్మాణాన్ని తొలగించి, ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. అందుకు కమిషనర్ స్పందిస్తూ.. అక్రమ నిర్మాణదారునికి నోటీసులు జారీ చేసి, చర్యలు తీసుకుంటామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు.

చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను సందర్శించిన స్థానిక నేతలు



రైల్వే అధికారులతో మాట్లాడుతున్న బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: ఈదురు గాలులకు చర్లపల్లి రైల్వే టెర్మినల్‌లో కూలిన సీలింగ్ మరమ్మతు పనులను వేగవంతం చేయాలని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. సోమవారం టెర్మినల్‌లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ప్రకృతి వైపరిత్యంతో చోటుచేసుకున్న ఘటనపై రైల్వే అధికారులతో మాట్లాడి ఆరా తీశారు. కోట్లాది రూపాయాలతో నిర్మించిన టెర్మినల్‌లో నాణ్యత ప్రమాణాలు పట్టించుకోకపోవడం దురదుష్టకరమన్నారు. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణహాని జరగలేదని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని రైల్వేస్టేషన్ అధికారులకు సూచించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్‌యాదవ్, గోపాల్‌యాదవ్, రఘు తదితరులున్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

చర్లపల్లి రైల్వే టెర్మినల్‌లో కూలిన సీలింగ్ ఘటనను నిరసిస్తూ సీపీఎం మేడ్చల్ జిల్లా పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. జిల్లా కార్యదర్శి సత్యం, కార్యదర్శి వర్గ సభ్యుడు చంద్రశేఖర్, ఎర్ర అశోక్, శ్రీనివాసులు, రాజశేఖర్, వెంకన్న, గణేష్, చంద్రశేఖర్, కార్తీక్, అవినాష్ తదితరులున్నారు.

గురుకుల్ అభివృద్ధికి ఉత్తరాల ఉద్యమం



ఉత్తరాలు అందజేస్తున్న గురుకుల్ పూర్వ విద్యార్థులు

ఘట్‌కేసర్: పట్టణంలోని గురుకుల్‌ను అభివృద్ధి చేయాలని పూర్వ విద్యార్థులు ఉత్తరాలు పంపారు. గురుకుల్‌కు పూర్వవైభవం తేవాలని, గురుకుల్ ఆవరణలో నిర్మాణాలు చేపట్టి పేద విద్యార్థులకు కేజీ-పీజీ వరకు ఉచిత విద్య అందజేయాలని సీఎం రేవంత్‌రెడ్డి, కేబినెట్ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు సోమవారం లేఖలు పంపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీనివాస్‌యాదవ్, సురేశ్, కుమార్, అభిలాశ్ యాదవ్, యష్‌పాల్, ప్రశాంత్, జగదీశ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని ఆరో వార్డులో రూ.10 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు సోమవారం కొనసాగాయి. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పావనీజంగయ్య పరిశీలించారు. వర్షం నీరు రోడ్డుపై నిలిచి గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్న స్థానికుల విన్నపం మేరకు గత పాలకవర్గం నిధులు కేటాయించింది. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నస్రీన్ సుల్తానా, సిరాజ్, నాగేశ్, స్థానికులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న మాజీ చైర్ పర్సన్ పావనీజంగయ్య, నస్రీన్ సుల్తానా

కారిడార్ పనుల జాప్యంపై కేంద్రమంత్రికి వినతి



కేంద్రమంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్: అంబర్‌పేట ఫ్లై ఓవర్‌ను ప్రారంభించేందుకు నగరానికి వచ్చిన కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గట్కరీని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులు ప్రారంభమై ఏడేళ్లు గడుస్తున్నా.. ఇంకా 30 శాతం పనులు కూడా పూర్తికాలేదని, దీంతో ఇక్కడి ప్రజలే కాకుండా వరంగల్ జాతీయ రహదారిపై వాహనాల నడుపుతున్న వారు కూడా నిత్యం అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కారిడార్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి త్వరలో పనులు పూర్తి చేయడానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



అల్వాల్: మురళీకృష్ణ కాలనీలోని సాయిసూర్య ఎన్‌క్లేవ్‌లో నూతనంగా నిర్మించిన శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి సమేత నగరేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం కొనసాగుతోంది. సోమవారం శోభాయాత్ర, జలాధివాస ఉత్తాపన, మహాస్నపన కలశ స్థాపన, చండీ హోమం, ధాన్యాధివాసం, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మశ్రీ తెగుళ్ల సనాతన సారథి కృష్ణ యజుర్వేద పండితులు, ఆలయ కమిటీ సభ్యులు సిరిపురం ఆనందబాబు, ప్రొద్దుటూరు నాగేశ్వర్‌రావు, అమర శ్రీను, ఉప్పల రాంబాబు, గంగాధర్, పెద్ది రమేష్, శివ, ఆలయ ధర్మకర్తలు, దాతలు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ కార్యాలయానికి క్యూ

- కిందిస్థాయి అధికారులు పట్టించుకోకపోవడంతో..
- ప్రజావాణిలో పెరుగుతున్న ఫిర్యాదులు
- జిల్లాస్థాయి అధికారులు స్పందించాలి
- గైర్హాజరయ్యే అధికారులపై చర్యలు తప్పవు
- జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ హరిప్రియ



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశపు హాలులో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లా ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్(రెవెన్యూ) హరిప్రియకు పదుల సంఖ్యలో ఫిర్యాదులతో కూడిన దరఖాస్తులను సమర్పించారు. సమస్యలపై సంబంధిత అధికారులు సకాలంలో స్పందించకపోవడంతో ప్రజలు అవే సమస్యలపై ఫిర్యాదులు అందజేస్తున్నారు. నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి ప్రజావాణిలో 25 ఫిర్యాదులు అందాయి అంటే పరిస్థితి ఏవిధంగా ఉందో తెలిసిపోతోంది. ప్రజావాణి ఫిర్యాదులపై సీరియస్ సమీక్ష లేకపోవడంతో పాటు నిర్లక్ష్యం చేసిన సంబంధిత శాఖ అధికారిపై ఇప్పటి వరకు శాఖాపరమైన చర్యలు లేకపోవడంతో వాటిని సాధారణ దరఖాస్తుగా పరిగణిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

- వివిధ ప్రాంతాలు, బస్తీలు, గ్రామాల నుంచి వచ్చిన పలువురు ప్రజలు, మహిళల సంక్షేమ పథకాలకు సంబంధించి పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల కోసం ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు. భూకబ్జాలు, ప్రభుత్వ, అసైన్డ్ భూముల ఆక్రమణలపై 32 ఫిర్యాదులు రాగా, పురపాలక సంఘాల్లో అక్రమ భవన నిర్మాణాలు, అనుమతి లేకుండా బహుళ అంతస్తుల నిర్మాణాలపై అత్యధికంగా 23 ఫిర్యాదులు వచ్చాయి. పోచారం, నాగారం, దమ్మాయిగూడ, పీర్జాదిగూడ, మేడ్చల్, ఘట్‌కేసర్, జవహర్‌నగర్, కొంపల్లి, తూముకుంట పురపాలక సంఘాలతో పాటు గాజులరామారం, కుత్బుల్లాపూర్, అల్వాల్ మున్సిపల్ సర్కిళ్లకు సంబంధించిన వాటిపై పెద్ద ఎత్తున ప్రజావాణిలో ఫిర్యాదులు అందాయి.
- విద్యాశాఖకు ఐదు, హౌసింగ్‌కు ఐదు, పంచాయతీశాఖకు రెండు, కీసర ఆర్డీఓకు సంబంధించి ఎనిమిది, ఏడీ సర్వేకు నాలుగు, శాఖలకు సంబంధించిన వాటితో సహా మొత్తం ప్రజావాణిలో పెద్ద ఎత్తున 91 ఫిర్యాదులు అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో కలెక్టరేట్ విభాగం రెవెన్యూ అధికారి రాజేశ్వర్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిల్లా అధికారులు తక్షణమే స్పందించాలి

వివిధ శాఖల అధికారులు, ముఖ్యంగా పురపాలక సంఘాల కమిషనర్లు సకాలంలో ప్రజా సమస్యలను పరిష్కరించకపోవడంతో ప్రజలు పదే, పదే ప్రజావాణిలో ఫిర్యాదులను అందజేస్తున్నారని జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ హరిప్రియ అన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే ఫిర్యాదులను పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ఎలాంటి అనుమతి లేకుండా గైర్హాజరయ్యే అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. అలాంటి అధికారులు ఉంటే వెంటనే నోటీసులు జారీ చేయాలని ఆమె ఆదేశించారు.